4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 14 డిసెంబర్ 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# ఈగో హర్ట్.. అందుకే అరెస్ట్?



ఏనుగుల రాకేష్‌రెడ్డి

**ఎనుముల వారి ఈగో హర్ట్ అయ్యింది. అల్లు అర్జున్ అరెస్ట్ అయ్యాడు. వినడానికి విచిత్రంగా ఉన్నా ఇదే నిజం. ఎన్నో కలలు కని, తన కళలు ప్రదర్శించి ముఖ్యమంత్రి పదవిని అధిరోహించిన రేవంత్ రెడ్డిని ఒక స్టార్ హీరో సినిమా వేదిక మీద తన పేరు తెలియక తడబడటంతో పాపం చిన్నబుచ్చుకున్నట్టున్నాడు! ఈగో హర్ట్ అయినట్టుంది. అందుకే కావొచ్చు ఈ హెచ్చరికతో కూడిన అరెస్టు! సినీ ఇండస్ట్రీ తనను ముఖ్యమంత్రిగా గుర్తించి ముఖ్య అతిథిగా పిలవడం లేదన్న వెలితి ఆయనను నిత్యం వెంటాడుతూనే ఉంది.**

పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో ప్రదర్శించిన ప్రీమియర్ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే తల్లి ప్రాణాలు కోల్పోయిన వార్త అందరినీ తీవ్రంగా కలిచివేసింది. ఆ దుర్ఘటన జరగకపోయి ఉంటే బాగుండని అందరం బాధపడ్డాం.

మాజీ మంత్రి కేటీఆర్ చెప్పినట్టు ఆ ఘటనకు పరోక్షంగా అల్లు అర్జున్‌నే దోషిగా గుర్తిస్తే, రాష్ట్రంలో హైడ్రా వల్ల ఆగిన గుండెలు, గురుకులాల్లో మరణించిన 48 మంది విద్యార్థులు, సీఎం రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి ఆత్మహత్యకు కూడా ఇదే లాజిక్ వర్తిస్తుంది కదా? అలా అయితే, సీఎం రేవంత్‌రెడ్డిని కూడా అరెస్టు చేయాలన్నమాట?

గతంలో ఎన్నో సినిమాల రిలీజ్ సందర్భంగా ఫ్లెక్సీలు కడుతూ కరెంట్ షాక్ కొట్టి, థియేటర్‌లో తొక్కిసలాటలో దురదృష్టవశాత్తు ఎందరో మరణించారు. అప్పుడు కూడా ఇలాగే హీరోలను దోషులుగా చేసి అరెస్టు చేశారా? రాజకీయ పార్టీల సభలకు వెళ్తూ, వస్తూ ప్రమాదాలు జరిగి కూడా ఎందరో మరణించారు. అప్పుడు ఆ సభలు నిర్వహించిన నాయకులను బాధ్యులను చేశారా?

ఈ దుర్ఘటనలో అల్లు అర్జున్ నైతిక బాధ్యత వహిస్తూ తన వ్యక్తిగతంగా రూ.25 లక్షల నష్టపరిహారంతో పాటు, పిల్లల వైద్య, విద్యా ఖర్చులు భరిస్తామన్నారు. పోయిన ప్రాణాలు తిరిగి తీసుకురాలేం. బాధ్యత గల పౌరుడిగా, లక్షలాది మంది అభిమానులు అనుసరించే హీరోగా అల్లు అర్జున్ ఒక ఆదర్శవంతమైన ప్రకటన చేశారు.

> **రేవంత్‌రెడ్డి గుర్తించుకోవాల్సింది ఏమిటంటే, మీరు గొప్పగొప్ప పనులు చేసే దాకా మీరు గుంపులో ఒకడిగానే మిగిలిపోతారు. కానీ, గొప్పగా గుర్తింపు పొందలేరు. ప్రముఖులు మిమ్మల్ని గుర్తించాలి, గుర్తుపెట్టుకోవాలి, గౌరవించాలంటే అంతే గొప్పగా మీ పాలన, మీ నడవడిక, మీ భాష ఉండాలి. కానీ, కక్ష కట్టి, కత్తి పెట్టి గౌరవ మర్యాదలు బలవంతంగా లాక్కుంటే వచ్చేవి కావని గ్రహించాలి.**

> **కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి సినీ ఇండస్ట్రీని గిల్లడం పరిపాటి అయింది. సినీ ఇండస్ట్రీలో ఇచ్చే నంది అవార్డు పేరు బలవంతంగా మార్చడమే కాకుండా ఆయన మాటనే శాసనం అంటూ టాలీవుడ్ సైతం ఒప్పుకోవాలని వేదికల మీద చిరంజీవి లాంటి స్టార్ హీరోలను బలవంత పెట్టారు.**



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి సినీ ఇండస్ట్రీని గిల్లడం పరిపాటి అయింది. సినీ ఇండస్ట్రీలో ఇచ్చే నంది అవార్డు పేరు బలవంతంగా మార్చడమే కాకుండా ఆయన మాటనే శాసనం అంటూ టాలీవుడ్ సైతం ఒప్పుకోవాలని వేదికల మీద చిరంజీవి లాంటి స్టార్ హీరోలను బలవంత పెట్టారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం, రాజకీయాలతో సంబంధం లేని ప్రముఖ హీరోయిన్ల వ్యక్తిత్వ హననం చేశారు. స్వయంగా బాధ్యత గల మంత్రులు కొండా సురేఖ లాంటివాళ్లే స్టార్ హీరోయిన్లకు అక్రమ సంబంధాలు అంటకట్టి ఆఖరికి కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. హైడ్రాకు ప్రచారం కరువైన సమయంలో సంచలనం కోసం హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను కూలగొట్టారు. ఇప్పుడు స్టార్ హీరో అల్లు అర్జున్‌పై నాన్ బెయిలబుల్ కేసు పెట్టి అరెస్టు చేశారు. ఇలా ఇండస్ట్రీపై ఆధిపత్యం కోసం, తన ప్రతాపం చూపడం కోసం వేధిస్తూనే ఉన్నారు.

ఇదంతా చూస్తుంటే పక్క రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సినిమా ఇండస్ట్రీ జోలికి వెళ్లి తెచ్చుకున్న పరిస్థితే రేవంత్‌రెడ్డి ఏరికోరి తెచ్చుకుంటున్నట్టు అనిపిస్తుంది. గతంలో టికెట్ రేట్ల పెంపుపై టాలీవుడ్ స్టార్ హీరోలను తన చాంబర్‌కు రప్పించుకొని చిరంజీవితో చేతులు జోడించి మొక్కించుకున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాటలో రేవంత్‌రెడ్డి నడుస్తున్న ఆనవాళ్లు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. తన అహం నెగ్గించుకోవడం కోసం అధికారాన్ని అడ్డుపెట్టుకున్న ఏ ముఖ్యమంత్రి పొడుగెల్లినట్టు చరిత్రలో లేదు. తెలంగాణ వచ్చిన కొత్తలో ఆంధ్రా డామినేషన్ ఉన్న టాలీవుడ్ తరలిపోతుందని ఎన్నో అపోహలు ప్రచారం చేసినా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత, ముందుచూపు, కళలపై వారికున్న అవగాహన, మక్కువ కారణంగా తెలుగు సినీ పరిశ్రమ ఎంతగానో వృద్ధి చెందింది. తెలంగాణ యాస, భాష సైతం సినిమాల్లో ఎంతగానో పరిఢవిల్లింది. పదేండ్లు ఎటువంటి ఆటంకం లేకుండా ఎంతో ఆత్మగౌరవంతో సినిమా పండుగలా సాగింది. కానీ, మార్పు పేరుతో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదిలోనే తెలుగు సినిమా ఇండస్ట్రీ అవమాన భారంతో 'ఉందునా! ఊకుందునా! ఊరుదాటి పోదునా' అన్నట్టు తయారైంది.

పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి రాజకీయ గురువు చంద్రబాబు పదేపదే తెలుగు సినీ పరిశ్రమ అమరావతికి తరలిరావాలన్న ప్రయత్నానికి, ఇండస్ట్రీ కోరిన రాయితీ ఇస్తానని ప్రకటిస్తున్న తాయిలాలకు మద్దతుగా రేవంత్ రెడ్డి చర్యలు, పాలసీలు, ప్రవర్తనలు ఉన్నాయి. చంద్రబాబు కోరిక తీర్చడం కోసం సినీ ఇండస్ట్రీని తరలించేందుకు రేవంత్ రెడ్డి తన వంతు కృషి చేస్తున్నారా? అన్న అనుమానం కలుగుతున్నది. గురువు గారికి గురుదక్షిణ ఇవ్వడం కోసమేనా ఈ ఆరాటం? ఈ చర్యలు చూస్తుంటే అదే నిజం అనిపిస్తుంది.

**(వ్యాసకర్త: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు)**

# కోర్టుకు పోకుండానే కేసుల పరిష్కారం



జి.జ్యోతిరావు
96768 75789

**దేశ న్యాయవితరణ విషయంలో ప్రజలకు కొన్ని ప్రగాఢమైన అభిప్రాయాలు, నమ్మకాలు ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి న్యాయం తొందరగా దొరకదు, దొరకనివ్వరు, దొరకటం లేదు, దొరికినా అది అత్యంత వెలగలది. ప్రాణాలు పోతుంటాయి.. తరాలు గడుస్తుంటాయి.. కానీ, కోర్టుల్లో దొరికేది వాయిదానే తప్ప న్యాయం కాదన్నది చాలామంది అభిప్రాయం. ఇంకా చెప్పాలంటే మనం చచ్చే వరకు కోర్టుల్లో న్యాయం దొరకదు అన్నది స్పష్టంగా వినిపించే మాట.**



ప్రజల్లో ఈ రకమైన అభిప్రాయం ఏర్పడేందుకు కారణాలు లేకపోలేదు. ఇవేవో ఊసుపోకకు అనే మాటలు, అభిప్రాయాలు కావు. ఢిల్లీ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు, 30 ఏండ్ల నుంచి మూడు రోజుల కిందటి వరకు, మన కోర్టుల్లో జడ్జిమెంట్ల కోసం ఎదురుచూస్తున్న కేసులు అచ్చంగా 4.44 కోట్ల పైచిలుకు ఉన్నాయని జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ చెబుతోంది. వీటిలో 85 శాతానికి పైగా కేసులు జిల్లా స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయట. అంతేకాదు, దేశం మొత్తం మీద 6 లక్షల కేసులు 20 నుంచి 30 ఏండ్ల దాకా పెండింగ్‌లో ఉన్నాయి. ఇందుకు కారణాలు అనేకం. మొత్తం పెండింగ్‌లో ఉన్నవాటిలో 1.08 కోట్ల కేసులు సివిల్ అయితే, 3.36 కోట్లకు పైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పెండింగ్ లెక్కలు చూస్తే మనకు ముఖ్యంగా మూడు విషయాలు స్పష్టమవుతాయి. ఒకటి, దేశంలోని కోర్టుల్లో దిన దినం కేసులు పెరుగుతున్నాయి లేదా కోర్టుల పనిభారం పెరుగుతోంది. రెండు, 30 ఏండ్ల నుంచి పేరుకుపోయిన కేసులతో పోలిస్తే క్రిమినల్ కేసులు ఒకే సంవత్సరంలో సివిల్ కేసుల సంఖ్యను దాటిపోతున్నాయి. మూడు, దేశంలోని కోర్టుల మీద రోజురోజుకు క్రిమినల్ కేసుల భారం పెరుగుతున్నది. క్రిమినల్ కేసుల మాట అటుంచి, కోర్టుల మీద కేసుల భారం తగ్గించడానికి మనం కోర్టులకు వెళ్లకుండానే సమస్యను పరిష్కరించుకోవడానికి ముఖ్యంగా చట్టపరమైన రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి, 1996 నాటి ఆర్బిట్రేషన్ కన్సీలియేషన్ చట్టం. ఈ చట్టం 2021లో సవరణలు పొంది సివిల్ వివాదాల పరిష్కారంలో కోర్టుల ప్రమేయం పూర్తిగా తగ్గించింది. రెండోది, గత సంవత్సరం సెప్టెంబర్‌లో ప్రకటితమైన మధ్యవర్తిత్వ చట్టం, 2023.

ఇద్దరు కక్షిదారులు సుశిక్షితులైన నిపుణుల సమక్షంలో తమ సమస్యను తామే పరిష్కరించుకుని ఒక ఒప్పంద పత్రం రాసుకొని, ఆ మధ్యవర్తి సంతకం తీసుకుంటే అది మధ్యవర్తిత్వం అవుతుంది. ఆ ఒప్పంద పత్రాన్ని కోర్టు డిక్రీగా పరిగణిస్తారని మధ్యవర్తిత్వ చట్టం చెబుతోంది. అలాకాక ఇద్దరు కక్షిదారులు తమ సమస్యను సుశిక్షితులైన నిపుణులకు అప్పజెప్పి తమ తగవు తీర్చమని అడిగితే అది ఆర్బిట్రేషన్ అవుతుంది. ఆ మధ్యవర్తులు ఇచ్చే అవార్డు కోర్టు డిక్రీతో సమానమని, దానికి కక్షిదారులు కట్టుబడి ఉంటారని, అదే తుది నిర్ణయమని ఆర్బిట్రేషన్ చట్టం, 1996 చెబుతోంది. ఆర్బిట్రేషన్ ప్రక్రియ పూర్తిగా 1996 నాటి చట్టానికి లోబడి జరుగుతుంది. సాధారణంగా కాంట్రాక్టులు, భూవివాదాలు, ఇన్సూరెన్స్ పాలసీలు, చిట్‌ఫండ్ వ్యవహారాలు, ఫైనాన్స్ కంపెనీలు ఇచ్చే అప్పులు, ఇండ్లు, అపార్ట్‌మెంట్లు, ప్రాజెక్టుల నిర్మాణ సమయాల్లో సంస్థలు, వ్యక్తులు ఒప్పంద పత్రాలు రాసుకుంటారు. ఇద్దరు వ్యక్తులు లేదా రెండు సంస్థలు లేదా వ్యక్తులు, సంస్థల మధ్య ఒప్పందాలు కుదిరినప్పుడు వారి మధ్య లావాదేవీల విషయాల్లో సమస్యలు, వివాదాలు కూడా తలెత్తవచ్చు. ఈ వివాదాల పరిష్కారం ఒక ఆర్బిట్రేటర్ ద్వారా కాని, మధ్యవర్తి ద్వారా కాని పరిష్కరించుకుందామన్న క్లాజు కూడా ఆ పని ఒప్పంద పత్రంలో, కాంట్రాక్టుల్లో పొందుపరచుకొని ఆర్బిట్రేషన్ ద్వారా తగవులు తెంపుకోవచ్చు. ఇక్కడ చాలామందికి తెలియని కిటుకు ఒకటి ఉంది. ఇలా తగవు తీర్చుకోవడానికి కాంట్రాక్టుల్లో ముందే ఒక ఆర్బిట్రేషన్ క్లాజు రాసుకోవడం లేదా అన్నాచెల్లెళ్ల మధ్య ఆస్తి తగాదాల విషయంలో వివాదం తలెత్తడం వంటి ఘటనల్లో ఆర్బిట్రేటర్‌ను నియమించుకోవాలని నిర్ణయించుకున్నా కోర్టుల ప్రమేయం అవసరమే లేదు. ఆర్బిట్రేటర్ల నియామకానికి గాని, తీర్పుల కోసం గాని కోర్టు మెట్లు ఎక్కాల్సిన అవసరం లేదు. అందులోనూ న్యాయవాదుల జేబులు నింపాల్సిన అవసరం అంతకన్నా లేదు. చట్టంలోని 11(2) సెక్షన్ ప్రకారం తమ ఆర్బిట్రేటర్లను తామే నియమించుకోవచ్చు లేదా సెక్షన్ 6 ప్రకారం మధ్యవర్తిత్వ సంస్థల సహకారంతో ఆర్బిట్రేటర్లను నియమించుకోవచ్చు.

ఆర్బిట్రేటర్ల నియామకాల్లో గాని, పరస్పర ఒప్పందంతో నియమితులైన ఆర్బిట్రేటర్ల తీర్పులో కాని కోర్టుల ప్రమేయం ఉండదు. కానీ, ఒప్పందం రాసుకున్న వ్యక్తుల్లో ఎవరైనా మానసికంగా తటస్థంగా లేకున్నా, భయపెట్టి, బెదిరించి ఒప్పందాలు రాసుకున్నా, ఆర్బిట్రేటర్లతో కక్షిదారుల్లో ఎవరికైనా సంబంధ బాంధవ్యాలు ఉన్నా, లేదా వారి మధ్య వాణిజ్య, వ్యాపారపరమైన లావాదేవీలు ఉన్నా, అడిగిన దానికి బదులుగా మరొక అవార్డు ఇచ్చినా, ఆ అవార్డులను సెక్షన్ 34(2) కింద కోర్టులు తోసిపుచ్చవచ్చు. అంతకుమించి ఆర్బిట్రేషన్ అవార్డులను ప్రశ్నించే హక్కులు కోర్టులకు లేవు. కోర్టు బయటే కొట్లాటలకు చెక్ పెట్టడానికి, కోర్టు జడ్జిమెంటుతో సమానమైన నిర్ణయాలు ప్రకటించడానికి, కోర్టుల కన్నా అతిశీఘ్రంగా, సులువుగా, చవకగా వివాదాలు పరిష్కరించుకోవడానికి సెక్షన్ 29(ఏ) ప్రకారం సెక్షన్ 23(4)కి లోబడి 12 నెలల్లో ఆర్బిట్రేషన్ అవార్డు ప్రకటించాల్సి ఉంది.

> **ఇన్ని అవకాశాలు, సదుపాయాలు ఉన్నా ఆర్బిట్రేషన్ ప్రక్రియ తగినంత ఆదరణకు నోచుకోలేదు. అందుకు కారణాలు ఉన్నాయి. ఈ చట్టంపై కావలసినంత ప్రచారం జరగలేదు. ప్రజలకు ఇలాంటి ఒక సులభమైన మార్గం అందుబాటులో ఉన్నదని తెలియదు. మధ్యవర్తిత్వం/ ఆర్బిట్రేషన్ వల్ల కేసులు త్వరితంగా పరిష్కారమైతే తమ వృత్తికి కాలం చెల్లిపోతుందన్న అభిప్రాయం వకీళ్లలో ప్రబలంగా ఉంది. కానీ, కేసులు త్వరగా పరిష్కారమైతే న్యాయవాదుల వృత్తి వృద్ధిలోకి రావడమే కాదు, వారి పట్ల గౌరవం కూడా పెరుగుతుంది.**


ఆర్బిట్రేషన్ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం ఆర్బిట్రేషన్ సంస్థలను సంప్రదించి సమస్యలు పరిష్కరించుకునే వెసులుబాటు ఉన్నా అలాంటి సంస్థలు ఏర్పాటు చేయడానికి వీలు కనిపించాల్సిన భారత ఆర్బిట్రేషన్ కౌన్సిల్ చట్ట సవరణ జరిగి నాలుగు ఏండ్లు అయినా ఇంకా ఏర్పాటు కాలేదు. అవగాహన లోపం వల్ల కొందరు న్యాయవాదులు చట్టంలోని సెక్షన్ 34(2)ను సరిగా ఉపయోగించుకోలేక కోర్టుల సమయాన్ని వృథా చేయడమే కాక, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార సిద్ధాంతాలనే పక్కదారి పట్టిస్తున్న దాఖలాలు ఉన్నాయి. ఆర్బిట్రేషన్ అవార్డులు ప్రకటితమయ్యాక కోర్టులు అనవసరంగా పట్టించుకోకూడదని భారత సర్వోన్నత న్యాయస్థానం చేస్తున్న సూచనలను పెడచెవినపెట్టి సరిగా పట్టించుకున్న నాథుడే లేడు. పైపెచ్చు ఆర్బిట్రేటర్ల నియామకం కేవలం పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులతోనే జరుగుతుందని, ఆర్బిట్రేషన్ ఒక 'ఓల్డ్ బాయ్స్ క్లబ్'గా మారిందని ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ఇటీవల వ్యాఖ్యానించారు.

నిర్మాణ రంగంలో ఉన్న అనేకులు వారికి, లబ్ధిదారులకు మధ్య వచ్చే వివాదాలను కోర్టు ప్రమేయం లేకుండా తామే ఆర్బిట్రేటర్లను నియమించుకొని పరిష్కరించుకోవచ్చని వారికి ఇంకా తెలియదు. దీని మీద విస్తృత ప్రచారం జరగాల్సి ఉంది. ఆర్బిట్రేషన్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని తమకు, ప్రజలకు మధ్య వచ్చే సమస్యలు పరిష్కరించుకోవచ్చని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు, సంస్థలకూ తెలియదు.

ఆర్బిట్రేషన్ అనేది ఇద్దరు కక్షిదారులు పరస్పర సమ్మతితో స్వచ్ఛందంగా చేసుకునే ప్రక్రియ. ఆర్బిట్రేటర్‌ను ఉమ్మడిగా నియమించుకోవడం కాని, ఆర్బిట్రేషన్ సంస్థలను కోరడం కాని జరగాలి. కానీ, ప్రైవేటు సంస్థలతో ఒప్పందాలు చేసుకొని ఎదుటి పార్టీని ఆర్బిట్రేషన్‌కు లాగడం చట్ట విరుద్ధం. ఈ విషయం అర్థం కాని ఫైనాన్స్ కంపెనీలు, రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలతో ఒప్పందాలు చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. ఇలా చేయడం వల్ల తమ అజ్ఞానంతో ప్రాప్తి పొందడమే కాకుండా ఎదుటివారి అజ్ఞానాన్ని కూడా సొమ్ము చేసుకున్నట్టు అవుతుంది. చట్టాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ఆస్తులు, ఆర్థిక లావాదేవీలు, కాంట్రాక్టు వ్యవహారాలు, వారసత్వ వివాదాలు కోర్టుల ప్రమేయం లేకుండా సత్వరంగా పరిష్కరించుకోవచ్చు. భారత ఆర్బిట్రేషన్ కౌన్సిల్ ఏర్పాటు చేసి ప్రైవేటు ఆర్బిట్రేషన్ సంస్థల పరిపాలన ఇతర వ్యవహారాలను పర్యవేక్షించడం ద్వారా సంస్థాగత ఆర్బిట్రేషన్ ఇంకా సులభతరం అవుతుంది.

**(వ్యాసకర్త: అధ్యక్షురాలు, అమికా ఆర్బిట్రేషన్, మీడియేషన్ కౌన్సిల్)**

> **ఇద్దరు కక్షిదారులు నిపుణుడి సమక్షంలో తమ సమస్యను తామే పరిష్కరించుకుని ఒక ఒప్పంద పత్రం రాసుకొని, ఆ మధ్యవర్తి సంతకం తీసుకుంటే అది మధ్యవర్తిత్వం అవుతుంది. ఆ ఒప్పంద పత్రాన్ని కోర్టు డిక్రీగా పరిగణిస్తారు. అలా కాకుండా ఇద్దరు కక్షిదారులు తమ సమస్యను సుశిక్షితులైన నిపుణులకు అప్పజెప్పి తగవు తీర్చమని అడిగితే అది ఆర్బిట్రేషన్ అవుతుంది.**




## ఫోన్‌కాల్‌తో యుద్ధాన్ని ఆపగలిగే ప్రధాని..
# బంగ్లా అల్లర్లను ఆపలేరా?



**బంగ్లాదేశ్‌లో హిందువులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయి. అక్కడి గుడులు, గోపురాలూ ధ్వంసమవుతున్నాయి. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో సురక్షితంగానే ఉన్నారు. మరి ఆ దేశంలోని హిందువుల పరిస్థితేంటి? ఒక్క ఫోన్ కాల్‌తో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపగలిగే మోదీ.. బంగ్లా హిందువులపై జరుగుతున్న దాడులను ఆపలేరా?**

**- ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర మాజీ సీఎం**



# నమ్మిన ప్రజలను నట్టేట ముంచి పండుగలా!



మేడిపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి
96151 46666

**ఓ ఊరిలో పాముకాటుతో ఒకాయన చనిపోయాడట. కొందరు సావు కాడికిపోయి.. 'పాము ఏడ కరిచింది? కన్ను కింద కరిచిందా.. ఇంకా నయం కన్ను మీద కరవలేదు. కన్నుపోతుండె' అని వారు అన్నరట. మనిషే సచ్చిపోయిండు. ఇక పాము ఏడ కరిస్తే ఏంది? ఆడ కరిస్తే కన్ను పోతుండె.. ఈడ కరిస్తే కాలుపోతుండె అనడంలో అర్థం ఉందా? కేసీఆర్ అప్పట్లో చెప్పే ఈ కథ లెక్కనే ఉన్నది కాంగ్రెస్ పాలకుల పనితీరు. ఇంకా చెప్పాలంటే సంపినోడే సావుకాడికి పోయి సావు డప్పు కొట్టినట్టు ఉంది.**

మన దేశానికి స్వాతంత్య్రం వచ్చిన నాటినుంచీ పాలమూరును నిర్లక్ష్యం చేసిందే కాంగ్రెస్ పార్టీ. పక్కనే కృష్ణా నది ప్రవహిస్తున్నా సాగు నీళ్లు అందించలేని అసమర్థత కాంగ్రెస్ పాలకులది. ఉమ్మడి ఏపీని 40 ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ.. ప్రాజెక్టులు నిర్మించి పాలమూరుకు నీళ్లివ్వలేకపోయింది. ఏటికేడు ప్రాజెక్టుల నిర్మాణాన్ని సాగదీసే చరిత్ర ఉన్న హస్తం పాలకులు నేడు పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో మిగిలిన 10 శాతం పనులను కూడా పూర్తి చేయలేకపోతున్నారు.

నాటి కాంగ్రెస్ పాలకుల చేతకాని పాలనే పాలమూరుకు వలసల జిల్లా అనే పేరు తెచ్చిపెట్టింది. నేటి పాలకులు కూడా అదే బాటలో నడుస్తున్నారు. అంతేకాదు, 'పాలమూరు మాదిగలు డప్పులు కొట్టాలె.. మనది మాదిగల జిల్లా' అంటూ ముఖ్యమంత్రి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఎన్ని జన్మలెత్తినా కాంగ్రెస్ పార్టీ పాలమూరుకు చేసిన అన్యాయానికి ప్రాయశ్చిత్తం లభించదు. సకలజనుల వనరులను సర్వనాశనం చేసి, జలహారతులిచ్చి 'మా నీళ్లు తీసుకుపోండి' అని నీళ్ల దోపిడీకి సహకరించిన పార్టీ మళ్లీ అందలమెక్కడం మన ఖర్మ. నాటి పరాయి పాలనలో జరిగిన విధ్వంసాన్ని రూపుమాపి, జల వనరులు సృష్టించిన మనీషి కేసీఆర్. సాగు, తాగునీరు అందించడమే కాకుండా రైతుబంధు ఇచ్చి రైతన్నల మోములో చిరునవ్వులు పూయించింది కేసీఆర్ సర్కార్. కేసీఆర్ హయాంలో పాలమూరు జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో గ్రామ దేవతలను కొలుస్తూ దాదాపు 40 ఏండ్ల తర్వాత పెద్దావర పండుగను రైతాంగం ఘనంగా జరుపుకొన్నది. ఆ సంబరాలు ఎంతో కాలం ఉండవంటూ మార్పు అనే పేరుతో వచ్చిన కాంగ్రెస్ సకల విధ్వంసాలు సృష్టిస్తున్నది. ఆనాటి రోజులు తెస్తామని చెప్పినట్టే నాటి నిర్లక్ష్యపు పాలన మళ్లీ తీసుకొచ్చింది నయవంచక కాంగ్రెస్. తాను పాలమూరు బిడ్డనని, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెస్తానని చెప్పి ఉన్న ప్రాజెక్టును పడావు పెట్టిన్రు. అంతేకాదు, నారాయణపేట- కొడంగల్ ప్రాజెక్టు పేరుతో సగం పాలమూరును మళ్లీ ఎడారి చేసే ప్రయత్నం చేస్తున్నారు.

> **రైతాంగాన్ని సకల విధాలుగా ధ్వంసం చేసి రైతు పండుగలంటూ హడావుడి చేస్తున్నారు. అసలెందుకు రైతు పండుగలు జరుపుతున్నట్టు? పచ్చబడ్డ పాలమూరును ఎండబెట్టినందుకా? జాతీయ హోదా తీసుకొస్తానని చెప్పి ప్రాజెక్టును పడావు పెట్టినందుకా? రైతు భరోసా ఇస్తనని చెప్పి కనీసం రైతుబంధు ఇవ్వలేకపోతున్నందుకా? బోనస్‌ను బోగస్ చేసినందుకా? పాలమూరు బిడ్డకు ఒకింత ప్రేమ ఎక్కువ ఉంటదని నమ్మిన ప్రజలను నట్టేట ముంచినందుకా?**

పండుగలను దండుగ చేసి ప్రచార ఆర్భాటాల కోసం పండుగలు చేస్తే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు. పుట్టిన గడ్డకు సేవ చేసే అవకాశం కోసం చాలామంది ఎదురుచూస్తుంటారు. కానీ, పాలమూరు బిడ్డ మాత్రం వచ్చిన అవకాశాన్ని కృష్ణానది పాల్జేశారు. ఈ ఏడాదికాలంలో పాలమూరుకు ఒరిగిందేమిటి? ఇప్పటికైనా ప్రచార ఆర్భాటాలు మానుకొని, పాలనపై దృష్టిపెడితే కనీసం పాలమూరు ఆత్మగౌరవాన్ని నిలబెట్టినవారు అవుతారు.



# ఇదేం ధోరణి సారూ!

> **పాలమూరులో జరిగిన రైతు సదస్సులో సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. 'మాదిగోళ్లు ఉన్నారా? డప్పులు కొట్టండి' అంటూ కులం పేరుతో సంబోధించారు. ఇది ముమ్మాటికీ దళిత సమాజాన్ని అగౌరవపరిచినట్టేనని దళిత సమాజం అభిప్రాయపడుతున్నది. ఆ తర్వాత వెంటనే రేవంత్‌రెడ్డి తేరుకొని 'పాలమూరు జిల్లా అంటేనే మాదిగోళ్ల జిల్లానయ్యా...' అంటూ తన వాక్ దోషాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.**

గ్రామాల్లో ఉన్నత కులాలుగా తమను తాము భావించుకునే కొన్ని కులాలవారు దళితులను 'మాదిగోళ్లు' అని అవహేళన చేస్తూ, దళిత సమాజాన్ని అవమానపరిచిన ఘటనలు చరిత్రలో ఎన్నో జరిగాయి. ఈ నేపథ్యంలో దళితులను కులం పేరిట పిలవటం లేదా దూషించటం చట్ట రీత్యా నేరమని పేర్కొంటూ రూపొందిన పలు చట్టాలు దళిత సమాజాన్ని రక్షించాయి. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న రేవంత్ రెడ్డి హుందాగా మాట్లాడాల్సింది పోయి కుల ప్రస్తావన తీసుకురావటం, కుల వృత్తిని ఎత్తిచూపటం ఖండనీయం. మాదిగలంటే కేవలం చెప్పులు కుట్టడం, డప్పులు కొట్టడం అనే పాత చింతకాయ పచ్చడి ధోరణి ఇకనైనా మారాలి. నేడు మాదిగలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మాదిగల్లో విద్యావంతులున్నారు, మేధావులున్నారు. తమ జాతి ఎదుర్కొంటున్న వివక్షపై నిలదీసే ఆధునిక అంబేద్కర్‌లు కూడా ఉన్నారు. మాదిగలంటే డప్పులు కొట్టేవాళ్లు కానే కాదు. మాదిగలంటే మహారాజులు, ఆదిజాంబవ బిడ్డలు. ఈ నేపథ్యంలో మాదిగలను డప్పులు కొట్టేవాళ్లుగా మాత్రమే చూసే ధోరణి ఇకనైనా మారాలి.

వీ.ధనంజి, 96661 09616